ఈరోజు (3 ఆగష్టు) సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో కామ్రేడ్ ఎల్‌బిజి శతజయంతి కార్యక్రమం అలాగే కామ్రేడ్ సున్నం రాజయ్య వర్ధంతి నివాళి కార్యక్రమాలు జరిగాయి. ఆ వివరాలను ప్రచురణార్థం/ ప్రసార్థం పంపుతున్నాము.

-జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

# ఉద్యమాలను కొత్తపుంతలు తొక్కిస్తూ పార్టీని అగ్రస్థానంలో నిలపాలి
## - యువతరాన్ని ఉద్యమాల్లో ముందుకు నడపాలి
## - ఎల్‌బిజి ఆశయాలకు పునరంకితంకావాలి
## - రాజయ్య మృతి గిరిజన ఉద్యమాలకు తీరని లోటు
## - ఎల్‌బిజి శతజయంతి, రాజయ్య వర్ధంతి సభలో వక్తలు

సిపిఎం ఉద్యమాల్లో యువతరాన్ని ముందుకు నడపాలని, ప్రజా ఉద్యమాలను కొత్తపుంతలు తొక్కిస్తూ పార్టీని అగ్రస్థానంలో నిలబెట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి శ్రీనివాసరావు (విఎస్ఆర్) అన్నారు. సిపిఎం అగ్రనేతల్లో ఒకరు, మాజీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ రాష్ట్రకార్యదర్శి లావు బాలగంగాధరరావు(ఎల్‌బిజి) శతజయంతి, గిరిజన ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య ప్రథమ వర్ధంతి సభ విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రకమిటీ సభ్యులు ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎల్‌బిజి చిత్రపటానికి విఎస్ఆర్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎల్‌బిజి శత జయంతి ఉత్సవాలు జరపాలని పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని, ఆగష్టు 15 నుండి సెప్టెంబర్ 15 వరకు రాష్ట్రవ్యాపితంగా సభలు, సమావేశాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఆయన పేరు వింటే మొదటగా పార్టీ నిర్మాణ దక్షత గుర్తుకొస్తుందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాయకత్వం వహించి, దళాలను ముందుకు నడిపించారని, ఉద్యమాలను, ప్రజలను రక్షించడంలో ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా పార్టీని పటిష్టం చేయడంలో ఎనలేని కృషి చేశారని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య పార్టీ కార్యదర్శిగా ఉన్నప్పుడు, సహాయకార్యదర్శిగా ఎల్‌బిజి ఉన్నారని, సమస్యలను చాలా చాకచక్యంతో పరిష్కరించేవారని గుర్తుచేశారు. ఆయన కార్యదర్శిగా ఉన్న సమయంలో డివైఎఫ్ఐ ఆర్థికంగా స్వతంత్ర వనరులు సమకూర్చుకోవడానికి సహాయ,సహకారాలు అందించారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘంలో ప్రత్యక్షంగా నాయకత్వం వహించారని, ఈ సంఘంలోకి యువతరాన్ని తీసుకురావడం, కొత్తతరాన్ని అభివృద్ధి చేయాలనే తపనతో కృషి చేశారని వివరించారు. ప్రపంచ కమ్యూనిస్టు, భారత కమ్యూనిస్టు ఉద్యమాలు చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో ఎదుర్కొంటున్నాయని అన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థ సంక్షోభంలో పడిందని, కమ్యూనిస్టు ఉద్యమాలు ఊపందుకుంటున్నాయని తెలిపారు. చైనా సాధిస్తున్న విజయాలు కమ్యూనిస్టుల్లో ఆశలు చిగురిస్తున్నాయి, సోవియెట్ యూనియన్ కాలంనాటి పరిస్థితులు ముందున్నాయనే నమ్మకం కలుగుతోందని పేర్కొన్నారు. కేరళలో సిపిఎం కు వచ్చిన విజయం చారిత్రాత్మకమని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఓటములు ఎదురైనా, రానున్నకాలంలో కమ్యూనిస్టులకు స్థానాలు దక్కుతాయనే నమ్మకం వస్తోందన్నారు. ప్రజలను కదిలించే ఉ ద్యమాలు చేయడానికి అవకాశాలు వచ్చాయని, ఢిల్లీలో విశాఖ ఉక్కు కార్మికుల పోరాటాలు, ప్రభుత్వాన్ని, దాని నిర్బంధాలను ఎదురిస్తున్నాయని తెలిపారు. మోడీకి ఉన్నటువంటి ప్రజాదరణ క్రమక్రమంగా కుప్పకూలుతోందని పేర్కొన్నారు. కొత్తతరాన్ని పార్టీలోకి తీసుకురావాల్సిన మన బాధ్యత ఉందని తెలిపారు. సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లో విద్యార్థి నాయకులు 80మందిని పార్టీ కార్యక్రమ నిబంధనలపై శిక్షణ ఇస్తున్నామని, ప్రజలకు నాయకత్వం వహించేలా వారిని తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. పార్టీని అగ్రస్థానంలో నిలపడానికి ఇది సరైన సమయం, యువతరాన్ని ఉద్యమంలో ముందుకు నడుపుతున్నామని తెలిపారు. పార్టీ ఉద్యమాలను కొత్తపుంతలు తొక్కించడం ద్వారా ఎల్‌బిజికి నివాళులు అర్పించాలని అన్నారు. సున్నం రాజయ్య పోరాడుతూనే కరోనాతో మరణించారని తెలిపారు. కరోనా కాలంలో ప్రజలను ఆదుకునే క్రమంలో, పోరాటాలు చేస్తూనే మరణించారన్నారు. గిరిజనుల్లో ఒకరిగా ఉంటూ ప్రజానాయకుడిగా మంచిపేరు తెచ్చుకున్నారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని తెలిపారు. ఆ లోటును భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎల్‌బిజి, రాజయ్యకు ఇరువురికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు.

సిపిఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు (వైవి) సున్నం రాజయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైవి మాట్లాడుతూ ఎల్‌బిజి క్లాసుల్లో పార్టీలో వర్గపొందిక, సామాజిక పొందిక అనే అంశాలు ప్రధానంగా ఉండేవని అన్నారు. అవి మాటలకే పరిమితం కాకుండా ఆచరణలోనూ ఆయన కార్యదర్శిగా ఉన్నప్పుడు అమలు చేయడంలో కృషి చేశారని తెలిపారు. ఏపి, తెలంగాణలో ఉన్న పార్టీ నాయకులు గుంటూరు మహాసభ సందర్భంగా రాష్ట్ర కమిటీలోకి వచ్చారని, యువనాయకత్వాన్ని ప్రోత్సహించడంలో మంచిపాత్ర పోషించారని పేర్కొన్నారు. ముక్కుసూటి తనంతో తప్పులను కుండబద్దలు కొట్టేవారని, కర్తవ్యం, బాధ్యతలను పార్టీ కార్యకర్తలకు కఠినంగా బోధించే వారని తెలిపారు. ఆయన సున్నిత మనసుతో కార్యకర్తల కష్టసుఖాలను అడిగి తెలుసుకుని పరిష్కరించేవారని, నేటికాలంలో నాయకులకు ఇటువంటి లక్షణాలు కావాలని అన్నారు. వీటిని అమలు చేయడమే ఆయనకు అర్పించే ఘన నివాళి అని పేర్కొన్నారు. సున్నం రాజయ్య అకాల మరణం పార్టీ ఉద్యమాలు, గిరిజన ఉద్యమాలకు తీవ్ర నష్టమని అన్నారు. ఇరువురి ఆశయాలకు కార్యకర్తలు పునరంకితం కావాలని కోరారు.

సిపిఎం సీనియర్ నాయకులు బిఆర్ తులసీరావు మాట్లాడుతూ ఎల్‌బిజి వ్యక్తిగత క్రమశిక్షణతో మెలిగేవారు. అందరూ వాటిని నేర్చుకోవాల్సి ఉందని తెలిపారు. సమావేశాలు, సభలకు అనుకున్న సమయానికి ఎల్‌బిజి వచ్చేవారని, ఇటువంటి విధానాలను అమలు జరిపి పార్టీని ముందుకు నడపాలనే శపథం పూనాలని కాంక్షించారు. పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంత స్వచ్ఛతను కాపాడు కోవాలని, దీనికి అనుగుణంగా కార్యకర్తలను కాపాడుకోవాలని అన్నారు. ఈ రెండు లక్షణాలను ఎల్‌బిజి అవలంభించారని, వాటిని ప్రస్తుత తరం నాయకులు నిలబెట్టుకోవాలని తెలిపారు. ఆయన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లే కార్యకర్తలను కాపాడుకుంటూ, వారిని ఉద్యమాల్లో ముందుకు తీసుకెళ్లడమే మన ముందు ఉన్న కీలకపాత్ర అని పేర్కొన్నారు. శతజయంతి ఉత్సవాలు సందర్భంగా వీటిని ముందుకు తీసుకెళ్లడానికి ప్రతినబూనాలని తెలిపారు. గిరిపుత్రుడుగా, పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడిగా సున్నం రాజయ్య ఎనలేని సేవలందించారని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని తెలిపారు. వీరిరువురి అనుభవాలు, జీవన విధానాలను అనుసరిస్తూ ప్రజాఉద్యమాలను ముందుకు తీసుకెళతామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి మురళీకృష్ణ, బి తులసీదాస్, మాల్యాద్రి(కెవిపిఎస్), డి కాశీనాథ్, పార్టీ నాయకులు జి నారాయణరావు, యువి రామరాజు, సుబ్బారెడ్డి, ఆర్‌వి నరసింహారావు, నూర్‌మహ్మద్ తదితరులు పాల్గొని ఎల్‌బిజి, రాజయ్య చిత్రపటాలకు పూలువేసి నివాళులర్పించారు.

= = = =